# సెన్సెక్స్ @ 70,000



- మళ్లీ 21,000 ఎగువకు నిఫ్టీ
- రూ.351 లక్షల కోట్లు దాటిన మార్కెట్ సంపద

### సెన్సెక్స్ ప్రస్థానం

| మైలురాయి | ఎన్ని రోజులు | చేరుకున్న తేదీ |
|---|---|---|
| 10,000 | ....... | 2006 ఫిబ్రవరి 7 |
| 20,000 | 463 | 2007 డిసెంబరు 11 |
| 30,000 | 2,318 | 2017 ఏప్రిల్ 26 |
| 40,000 | 520 | 2019 జూన్ 3 |
| 50,000 | 416 | 2021 ఫిబ్రవరి 3 |
| 60,000 | 158 | 2021 సెప్టెంబరు 24 |
| 70,000 | 548 | 2023 డిసెంబరు 11 |

ముంబై: దలాల్‌స్ట్రీట్‌లో మళ్లీ రికార్డుల మోత మోగింది. ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 70,000 మైలురాయికి చేరుకోగా.. ఇంట్రాడేలో నిఫ్టీ మరోసారి 21,000 మార్క్‌ను అధిగమించింది. బ్యాంకింగ్, ఐటీ, లోహ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. సోమవారం ట్రేడింగ్‌లో 70,057.83 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసుకున్న సెన్సెక్స్ మదుపరుల లాభాల స్వీకరణ కారణంగా చివరికి 102.93 పాయింట్ల లాభంతో 69,928.53 వద్ద పరుగు ఆపింది. నిఫ్టీ 21,026.10 వద్ద సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. చివర్లో 27.70 పాయింట్ల లాభంతో 20,997.10 వద్ద క్లోజైంది. సూచీకిది ఆల్‌టైం రికార్డు ముగింపు స్థాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 20 లాభపడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్ 3.04 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. నష్టపోయిన కంపెనీల్లో అత్యధికంగా యాక్సిస్ బ్యాంక్ 1.26 శాతం క్షీణించింది. కాగా, బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.91 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.71 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి. కొనుగోళ్ల జోరుతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.351.09 లక్షల కోట్లకు చేరుకుంది.

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడుల జోరు కూడా మార్కెట్ ర్యాలీకి ప్రధాన కారణాల్లో ఒకటి. ఈ నెల తొలి ఆరు ట్రేడింగ్ సెషన్లలో ఎఫ్‌పీఐలు రూ.26,505 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

## ఏడాదిన్నరలో 10,000 పాయింట్ల వృద్ధి

సెన్సెక్స్‌కు 60,000 నుంచి 70,000 స్థాయికి చేరుకునేందుకు ఏడాదిన్నర కాలం పట్టింది. కాగా, ఆరు నెలల్లోపే (107 ట్రేడింగ్ సెషన్లు) 65,000 నుంచి 70,000కు మార్క్‌ను తాకింది.

## స్పైస్‌జెట్ షేర్లు 10 శాతం అప్

మార్కెట్ నుంచి మరింత మూలధనం సేకరించడంతో పాటు ఎన్ఎస్ఈలోనూ షేర్లను లిస్టింగ్ చేయనున్నట్లు స్పైస్‌జెట్ ప్రకటించింది. దాంతో ఈ షేరు బీఎస్ఈలో 10.19 శాతం ఎగబాకి రూ.60.57కి చేరుకుంది. ఇంట్రాడేలో రూ.63.69 వద్ద ఏడాది గరిష్ఠాన్ని తాకింది.

## రూ.900 తగ్గిన బంగారం ధర

ఇటీవల కొండెక్కిన పసిడి ధరలు క్రమంగా తగ్గుతూవస్తున్నాయి. మళ్లీ రూ.62,000 దిగువకు జారుకుంది. ఢిల్లీ మార్కెట్లో పది గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర సోమవారం రూ.900 తగ్గి రూ.61,300కు పరిమితమైంది. కిలో వెండి రూ.200 తగ్గుదలతో రూ.76,000కు అమ్ముడైంది. అంతర్జాతీయంగా విలువైన లోహాల ధరలు గణనీయంగా తగ్గడం ఇందుకు దోహదపడింది.

## ఈవారంలో 5 పబ్లిక్ ఇష్యూలు

డోమ్స్ ఇండస్ట్రీస్, ఇండియా షెల్టర్ ఫైనాన్స్ సహా 5 కంపెనీలు ఈ వారంలో తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతున్నాయి. పబ్లిక్ ఇష్యూల ద్వారా ఈ ఐదు కంపెనీలు మొత్తం రూ.4,400 కోట్ల వరకు సమీకరించనున్నాయి. ఇష్యూకి రానున్న ఇతర కంపెనీల్లో ఐనాక్స్ సీవీఏ, మోతీసన్స్ జువెలర్స్, సూరజ్ ఎస్టేట్ డెవలపర్స్ ఉన్నాయి.

## రూ.2 లక్షల కోట్లకు స్మాల్‌క్యాప్ ఫండ్ల ఆస్తులు

గతనెల చివరినాటికి స్మాల్‌క్యాప్ ఫండ్ల నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) మొత్తం విలువ రూ.2 లక్షల కోట్లు దాటింది. గత ఏడాదిలో ఇదే సమయంతో పోలిస్తే ఏయూఎం విలువలో 69 శాతం వృద్ధి నమోదైంది. ఈక్విటీ మార్కెట్లో సానుకూల పరిస్థితులతోపాటు ఈ విభాగంలోని ఫండ్లలోకి ఎడతెరిపిలేకుండా పెట్టుబడులు వస్తుండటం ఇందుకు దోహదపడింది.